క్లుప్తంగా

ఎన్‌జీఓల నిరసన

పాలకొండ రూరల్: ఎన్‌జీఓ జేఏసీ పిలుపు మేరకు ఎన్‌జీఓలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలను పరిష్కారించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, ఎన్‌జీఓ సంఘ నాయకులు పైల ఈశ్వరావు, గౌరీశ్వరరావు, అనూష్‌బాబు, తదితరులున్నారు.

స్వేచ్ఛగా ఓటేసేలా ఏర్పాట్లు

వీరఘట్టం: పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే కమ్యూనికేషన్ సులువుగా అందేలా.. మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ డీఈఈలు గౌరీశంకరరావు, లోకనాథం, మండల ఇంజినీరింగ్ అధికారి కల్యాణిదుర్గ, వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి

● డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు

వీరఘట్టం: డ్వాక్రా సంఘాల బలోపేతానికి అందరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ వై.సత్యంనాయుడు సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీసుకున్న రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం జి.శివున్నాయుడు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా

● ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ చక్రవర్తి

వీరఘట్టం: రానున్న వేసవిలో మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పాలకొండ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ చక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. రూ.80 లక్షల విలువ గల కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు 19 వేల గృహ కనెక్షన్లు, 996 వ్యవసాయ మీటర్లు, 50 వరకు చిన్నచిన్న పరిశ్రమలు, సెల్ టవర్లు ఉన్నాయన్నారు. వీటికి ప్రతి రోజూ 3.5 ఎంవీఏ కరెంట్ వినియోగిస్తున్నామని చెప్పారు. వేసవిలో 6.5 ఎంవీఏ కరెంటు అవసరమవుతోందని, దీంతో గతంలో ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సమస్యలుండవని చెప్పారు.

అడవుల సంరక్షణ బాధ్యత అందరిదీ..

గుమ్మలక్ష్మీపురం: అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పి.దేవానంద్ అన్నారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఎం.నీలమణి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు అడవులు–వాటి ప్రాధాన్యత– ఫారెస్ట్ ఫైర్ నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం తగ్గిపోవడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, తద్వారా వర్షాలు సక్రమంగా కురవని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడవులు ప్రాధాన్యతపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు, స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. అటవీశాఖ వాచర్లు పి.ప్రసాదరావు, వి.కరుణాకరావు, పి. పోలిరాజు, ఉపాధ్యాయులు జి.గణేష్, సుబ్బారావు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గుమ్మలక్ష్మీపురం: టెన్త్ విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ముందుగా టెన్త్ విద్యార్థుల వద్దకు వెళ్లి సబ్జెక్టుల వారీగా పూర్తయిన సిలబస్, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన చిట్కాలను విద్యార్థులకు తెలియజేశారు. ఆయన వెంట హెచ్‌ఎం బి.భీముడు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: సున్నా నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు అన్నారు. మండలంలోని చెముడుగూడ గ్రామంలోని అంగన్‌వాడీ వద్ద శనివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎంతమంది గర్భిణులు, చిన్నారులు ఉన్నారు, వారిలో నవజాత శిశువులు ఎంతమంది, వారి ఆరోగ్య పరిస్థితి, తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు. అనంతరం కురుపాం మండలం గుమ్మ గదబవలస గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణిని 102 అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారు. సూపర్‌వైజర్లు జయగౌడ్, ఎర్రాయమ్మ, ఏఎన్‌ఎంలు భాగ్యలక్ష్మి, దమయంతి ఉన్నారు.

చినమంగళాపురంలో.. అభివృద్ధికి పట్టం

● లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు ● మౌలిక వసతుల కల్పన ● జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ఆర్థిక సాయం



చినమంగళాపురం నూతన గ్రామ సచివాలయ భవనం

పాలకొండ రూరల్:

నాగావళి నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తోంది చిన మంగళాపురం గ్రామం. ఆధ్యాత్మికత, రాజకీయ చైతన్యం, వ్యయసాయం, విద్యారంగం, వ్యాపారంలో రాణిస్తున్న యువత ఈ ప్రాంతానికి అదనపు హంగులు. గతంలో ఈ ప్రాంత ప్రజలను టీడీపీ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంక్‌గా భావించింది. కనీస మౌలిక వసతులు లేక అభివృద్ధికి నోచుకోక ఈ ప్రాంత ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారు. అయితే అదంతా గతం.. నేడు జగనన్న పాలనలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సంక్షేమం రెండూ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. ఈ సచివాలయ పరిధిలో ఎక్కడ చూసినా అభివృద్ధి ఫలాలు దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే, తదితర భవనాలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, తదితరులు ఇటీవల ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో చిన మంగళాపురం, యరకారాయపురం గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 3125 మంది జనాభా ఉండగా వీరిలో 1517 మంది పురుషులు, 1608 మంది మహిళలు. ఓటర్లు 2294 మంది కాగా పురుషులు 1110, మహిళ 1184 మంది ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమం జరగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ పరిధిలో ప్రత్యక్ష అభివృద్ధి..

- చిన మంగళాపురం, యరకారాయపురం పంచాయతీల్లో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ద్వారా సేవలు అందిస్తున్నారు.
- వ్యవసాయ ఆధారితమైన ఈ ప్రాంత రైతులకు అండా నిలిచేందుకు రైతుభరోసా కేంద్ర నిర్మాణానికి రూ.21.80 లక్షలు ఖర్చు చేశారు.



- రూ.37.57 లక్షల వ్యయంతో నూతన సీసీ రహదారులు, వీధి కాలువల నిర్మాణం చేపట్టారు.
- నాడు–నేడు పేరిట రూ.20 లక్షల వ్యయంతో యరకరాయపురంలో ఎంపీపీ పాఠశాలను అభివృద్ధి చేశారు. అలాగే చిన మంగళాపురంలో ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి రూ.1.20 కోట్లు ఖర్చు చేశారు.
- ప్రజలకు వైద్య సేవల నిమిత్తం సబ్‌సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సిబ్బందిని నియమించడంతో నిరంతర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ● గ్రామంలో రూ. 5.50 లక్షలతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు.
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అవసరమైన చోట సీసీ రహదారులు, వీధి కాలువల నిర్మాణాలు చేపట్టనున్నారు. పాలశీతల కేంద్రం, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాలు చేపట్టనున్నారు.



సర్వాంగసుందరంగా మారిన అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం సబ్ సెంటర్



ప్రజల దాహార్తిని తీరుస్తున్న రక్షిత పథకం

● ప్రత్యక్షంగా.... పరోక్షంగా.....

నవరత్నాల పేరిట సచివాలయ పరిధిలోని అర్హులకు సంక్షేమ పథకాలు అందించారు. ఈ క్రమంలో డీబీటీ విధానంలో రూ.12 ,65 ,60, 467 మొత్తాన్ని 4,961 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. 43 మందికి ఇళ్ల స్థలాలు అందించేందుకు సంబంధించి భూ సేకరణకు, 186 మందికి విద్యాకానుక అందించేందుకు, 8వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించేందుకు, 186 మంది విద్యార్థులకు గోరుముద్ద, 83 మందికి జగనన్న తోడు రుణాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ 53 మందికి, 636 మందికి రేషన్ అందించే క్రమంలో చేసిన ఖర్చు 2,74,91,185 రూపాయలు. మొత్తంగా సచివాలయం పరిధిలో 15,40,51,952 రూపాయలను వివిధ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రభుత్వ హయాంలో 1998 డీఎస్సీ ద్వారా మజ్జి దుర్గమ్మ, భవర్తి కేశవరావులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించగా.. సచివాయ వ్యవస్థ ద్వారా అరుగురు ప్రభుత్వ కొలువులు సాధిచారు.

ఉపాధి లభించింది..



నా చిన్నతనం నుంచి మా గ్రామంలో అభివృద్ధి లేదు. గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కనిపిస్తోంది. గ్రామంలో పలు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. ప్రభుత్వ బడులు ఎంతో సుందరంగా మారాయి. నాతో పాటు అనేక మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజల జీవనశైలి మెరుగుపడింది. బహిరంగ మలవిసర్జన అరికట్టేందుకు నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల వద్ద, చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్‌గా కొలువు దొరకడంతో మా గ్రామానికి సేవ చేసుకునే అదృష్టం కల్పించినందుకు జగనన్నకు నా కృతజ్ఞతలు. – పక్కి నక్షత్రమ్మ, గ్రీన్ అంబాసిడర్, చిన మంగళాపురం.



సామాజిక మరుగుదొడ్లు



అన్నదాతలకు గ్రామంలో సేవలు అందిస్తున్న రైతుభరోసా కేంద్రం

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన మొత్తం
జగనన్న అమ్మ ఒడి	522	రూ.1,19,55,248
జగనన్న విద్యాదీవెన	217	రూ.37,99,021
జగనన్న వసతి దీవెన	208	రూ.22,04,756
వైఎస్సార్ రైతు భరోసా	448	రూ.2,28,61000
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు(రైతులకు)	236	రూ.7,82,442
వైఎస్సార్ పంట బీమా	7	రూ.1,04,686
వైఎస్సార్ పెన్షన్ కానుక	534	రూ.5,19,94,000
వైఎస్సార్ చేయూత	307	రూ.1,33,87,500
వైఎస్సార్ ఆసరా	522	రూ.93,58,791
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలకు)	758	రూ.11,08,264
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	135	రూ.43,86,770
డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	90	రూ.5,60,175
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	3	రూ.2,10,983
వైఎస్సార్ బీమా	5	రూ.8,30,000
వైఎస్సార్ వాహనమిత్ర	12	రూ.3,90,000
జగనన్న చేదోడు (రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు)	10	రూ.1,80,000
కోవిడ్ ప్రత్యేక సహాయం (తెల్ల రేషన్ కార్డుదారులకు)	792	రూ.7,92,000
జగనన్న తోడు(వడ్డీ)	44	రూ.24,569
మత్స్యకార భరోసా	1	రూ.20,000



నాడు-నేడు పనులతో రూపు మారిన పాఠశాల

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

● జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి

కొమరాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. మండలంలోని కొమరాడ, ఉలిపిరి, గుమడ, చోళ్లపదం గ్రామ సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. అనంతరం వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీ కేంద్రిక అన్నపూర్ణ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు..

గరుగుబిల్లి: సంక్షేమ వారధులు వలంటీర్లు అని, వారి సేవలను వెలకట్టలేమని ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో శనివారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉత్తమ సేవలందించిన పలువురు వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వలంటీర్లు ప్రజాదరణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, ఎంపీటీసీ బొంగు గౌరమ్మ, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఈఓ ఎస్.అర్జునరావు, కార్యదర్శి కూర్మినాయుడు తదితరులున్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను ఎంపీడీఓ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



జియ్యమ్మవలస: ఇటిక సచివాలయంలో వలంటర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ



సింగన్నవలస సచివాలయంలో సన్మాన గ్రహీతలతో ప్రజా ప్రతినిధులు, అధికారులు



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు



కొమరాడ: వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, తదితరులు

సంక్షేమ రథసారథులు మీరే..

పాలకొండ రూరల్: ప్రభుత్వ పథకాలు అర్హుల గడపకు చేర్చే క్రమంలో వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని సింగన్నవలస సచివాయంలో స్థానిక వలంటీర్లతో పాటు సమీప పంచాయతీలైన వెలగవాడ, పరుశరాంపురం వలంటీర్లను శనివారం సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి నవీన్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి డొంక త్రినాథులు, మన్మధరావు, సచివాలయ సిబ్బంది, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజనాభివృద్ధి

● ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే గిరిజనాభివృద్ధి జరిగిందని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సీతంపేటలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. దాదాపు 23 వేల మంది గిరిజనులకు కొండపోడు పట్టాలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. అంతేకాకుండా ఆయా భూములకు రైతుభరోసా కూడా అందిస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాలకు విద్యుత్, రహదారి, తాగునీటి సౌకర్యాలు కల్పించారన్నారు. సీతంపేటలో రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే 30 పడకల ఆస్పత్రిని వంద పడకలుగా మార్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, ఎ.కళావతి, ఎంపీటీసీ సభ్యులు హరిబాబు, మంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, సాయికుమార్, అప్పారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం మార్పునకు తీర్మానం

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: మండల కేంద్రంలోని కూరాకులవీధి పాఠశాలలో 250, 251, 252 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇరుకు ప్రాంతంలో మూడు కేంద్రాలు ఉండడంతో గత ఎన్నికల్లో ఓటర్లు ఇబ్బంది పడ్డారని ఈ నెల 9 సాక్షిలో 'వేర్వేరు చోట్ల వద్దు...ఒకే చోట ముద్దు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. 252 పోలింగ్ కేంద్రాన్ని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేయడంతో అందరూ అంగీకరించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, భోగి మణి, నివర్తి శశి, చింత ఉమా, బొత్స మోహనరావు, మత్స పుండరీకం పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్

అభినందనలు





సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికకానున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిని చూపించడానికి సిద్ధం

● వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలో జరిగిన అభివృద్ధిని చూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, తదితరులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం పద్నాలుగేళ్లలో చేయని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిందని చెప్పారు. మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో లక్షలాది రూపాయలతో సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ భవనాలు నిర్మించారని తెలిపారు. ఆంధ్రా–ఒడిసా సరిహద్దులో రూ. 4.5 కోట్లతో మోడల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారని, అలాగే రూ.12 కోట్లతో భామినిలో ఏకలవ్య గిరిజన మోడల్ స్కూల్ భవనాలు నిర్మించారని తెలిపారు. నాడు–నేడులో భాగంగా 42 పాఠశాలలను అభివృద్ధి చేసిన తీరు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీటీసీ బూస బాలకృష్ణ, సర్పంచ్‌లు మడపాన కేశవ, బి.భార్గవ నాయుడు, రొక్కం రమేష్, మేడిబోయిన చలపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డంపింగ్‌యార్డును తరలించాలి

పాలకొండ రూరల్: పట్టణంలోని కొత్తవీధి శివారున తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును అక్కడి నుంచి తక్షణమే తరలించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ సూర్యనారాయణ అన్నారు. ఈ యార్డు నుంచి వెలువడుతున్న దుర్గంధం, పొగతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ మేరకు 1, 2, 19, 20 వార్డులకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావును శనివారం కలిసి సమస్య వివరించారు. ఈయన వెంట టీడీపీ నాయకులు జి.సంతోష్, పడాల రాంబాబు, జనసేన నాయకుడు పి.ప్రశాంత్, సీఐటీయూ నాయకుడు డి.రమణారావు, బీజేపీ నాయకులు కె.చిట్టిబాబు, ఎస్.క్రిష్ణ తదితరులున్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

పాలకొండ రూరల్: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డీఎస్పీ జీవీ కృష్ణారావు నేతృత్వంలో శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో వీరఘట్టం, దోనుబాయి, సీతంపేట, పాలకొండ మండలాల్లో నమోదైన ఈ తరహా కేసుల్లో సీజ్ చేసిన రెండు ఆటోలకు నిర్వహించిన వేలంలో రూ.24,400.. మూడు ద్విచక్రవాహనాలకు రూ. 83,600 సమకూరినట్లు పోలీసులు తెలిపారు. 42 సారా కేసుల్లో స్వాధీనపర్చుకున్న 1,144లీటర్ల సారా, ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన 52 మద్యం క్వార్టర్ బాటిళ్లను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సైలు ఎన్.ప్రశాంత్‌కుమార్, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శనివారం ఉదయం సుప్రభాత సేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి, బాలభోగం, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.